
సాక్షి
పల్నాడు
సోమవారం | 3 | మార్చి | 2025



మహారుద్రాభిషేకం

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో గంగాపార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహారుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 528.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 6,006 క్యూసెక్కులు విడుదలవుతోంది.

మావుళ్లమ్మ విగ్రహ పునఃప్రతిష్ట



కొల్లూరు: మండలంలోని చినపులివర్రు శివారు గురివిందపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గ్రామ దేవత మావుళ్లమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహరి (మంగళ)
నరసరావుపేట	6.13	5.10
గుంటూరు	6.22	5.10
బాపట్ల	6.21	5.08

న్యూస్‌రీల్

అమరేశ్వరుడి సేవలో ఐజీ హరికృష్ణ



అమరావతి: ప్రముఖ శైవ క్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వరుడిని ఆదివారం ఐజీ హరికృష్ణ, ఢిల్లీ డిప్యూటీ కమిషనర్ శ్రీరాములునాయక్‌లు కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు తొలుత వారికి స్వాగతం పలికి దేవాలయంలోకి ఆహ్వానించారు. అమరేశ్వరుడికి, బాలచాముండేశ్వరీ అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి, స్వామి వారి శేషవస్త్రంతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శింగరకొండ తిరునాళ్లకు ట్రాఫిక్ మళ్లింపు

అద్దంకి రూరల్: ఈ నెల 14వ తేదీన శింగరకొండ తిరునాళ్ల సందర్భంగా అద్దంకి వైపు వచ్చే వాహనాలను ఇతర దారులకు మళ్లిస్తున్నట్లు చీరాల డీఎస్పీ మొయిన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఎస్పీ వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి ఒంగోలు వైపు వెళ్లే వాహనదారులు సంతమాగులూరు క్రాస్ రోడ్, నరసరావుపేట నుంచి చిలకలూరిపేట మీదుగా ఒంగోలు వైపు, దర్శివైపు వెళ్లేవారు సంతమాగులూరు క్రాస్ రోడ్ నుంచి వినుకొండ, కురిచేడు మీదుగా దర్శి వైపునకు, రేణింగవరం నుంచి అద్దంకి మీదుగా దర్శి వెపు వెళ్లే వారు మేదరమెట్ల హైవే మీదుగా, ఒంగోలు నుంచి హైదరాబాద్ వెళ్లే వారు మేదరమెట్ల మార్టూరు వైపు హైవే మీదుగా హైదరాబాద్‌కు, దర్శి నుంచి అద్దంకి మీదుగా హైదరాబాద్ వెళ్లే వారు కురిచేడు, వినుకొండ, సంతమాగులూరు క్రాస్ రోడ్డు వైపునకు మళ్లాల్సి ఉంటుందని తెలిపారు. 14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 15వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఈ మార్పులు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. పైన నిర్ణయించిన సమయంలో కట్టెల ట్రాక్టర్లు, గడ్డి ట్రాక్టర్లు, పొట్టు ట్రాక్టర్లకు ప్రవేశం లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్సులకు, అంబులెన్స్‌లకు మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు.

యోగా, ధ్యానంతో పోలీసుల్లో ఒత్తిడి దూరం



నరసరావుపేట: పోలీసుల విధి నిర్వహణలో ఎదురయ్యే అధిక ఒత్తిడిని యోగా, ధ్యానంతో అధిగమించవచ్చునని పరిపాలనా విభాగ అదనపు ఎస్పీ జేవీ సంతోష్ పేర్కొన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్త వారోత్సవాలలో భాగంగా ఆదివారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో మహిళా పోలీసు సిబ్బంది, సచివాలయం మహిళా పోలీసులకు యోగా, ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువు జనార్దనరావు పర్యవేక్షణలో శిక్షణ ఇచ్చారు. స్థానిక మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రేపు బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

బాపట్ల: గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక మంగళవారం 2గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి మంతెన సుబ్బరాజు ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల మున్సిపల్ హై స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. 30-3-2009 తరువాత పుట్టిన వారై ఉండాలని, 55 కేజీల్లోపు బరువు ఉండాలని ఆయన వెల్లడించారు. ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు తీసుకురావాలని ఆయన సూచించారు.

చీటర్‌కే అనుకూలమా ఛీఐడీ ?

అన్ని డబ్బులెక్కడివని 'సాయిసాధన' బాధితులకే ఎదురు ప్రశ్నలు

ఇచ్చిన మొత్తం తిరిగి వస్తుందో రాదో.. ఎవరికి చెబితే వేదన తీరుతుందో.. అనే దిగులుతో ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్న సాయిసాధన చిట్‌ఫండ్ బాధితులకు సీఐడీ షాక్ ఇస్తోంది. ఉన్న కొద్దిపాటి ఆశలను ఆదిలోనే సమాధి చేస్తూ సీఐడీ అధికారులు అడిగే ప్రశ్నలు బాధితుల గుండెల్లో మరింత వేదన మిగులుస్తున్నాయి. అయ్యా.. కష్టపడి రూపాయి రూపాయిగా కూడబెట్టుకున్న డబ్బులను వడ్డీ ఆశతో పుల్లారావుకు ఇస్తే నిండా మునిగిపోయామని చెప్పేలోగానే అధికారులు వారి అసలు నైజం చాటుతున్నారు. పోయిన డబ్బుల సంగతి సరే.. అసలు మీకు అంత మొత్తం ఎలా వచ్చాయి.. వాటికి లెక్కలు చెప్పండి.. అంటూ ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు. బాధితులు చేసేది లేక అంతులేని వేదనతో వెనుదిరుగుతున్నారు. ఇదేం అన్యాయమంటూ గుండెలు బాదుకుంటున్నారు. చీటర్‌కే అనుకూలంగా వ్యవహరిస్తున్న నిస్సిగ్గు సీఐడీ, ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- పుల్లారావు కేసు విషయంలో దారుణంగా సీఐడీ ధోరణి
- మోసపోయిన మొత్తం వదిలేసి.. ఎలా వచ్చాయంటూ నిలదీత
- ఇదెక్కడి తీరంటూ గుండెలు బాదుకుంటున్న బాధితులు
- పుల్లారావుకు మేలు చేసేలా కూటమి ప్రభుత్వ తీరు ఉందని ఆగ్రహం
- ఆయన కుటుంబంపైనా ఇప్పటివరకు చర్యలు లేవంటూ ఆవేదన
- పుల్లారావు స్కాంపై అసెంబ్లీలో చర్చించాలని ఎమ్మెల్యేకు వినతి





బాధితుల సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ సభ్యుడు

నరసరావుపేట టౌన్: రెండు నెలల క్రితం గుంటూరు, పల్నాడు జిల్లాలతోపాటు రెండు తెలుగు రాష్ట్రాలవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సాయిసాధన చిట్‌ఫండ్ పాలడుగు పుల్లారావు స్కాం కేసులో బాధితుల వేదన అంతా ఇంతా కాదు. అధిక వడ్డీ ఆశ చూపి, లేని ఆస్తులు ఉన్నట్లు మాయ చేసి సుమారు వెయ్యి మంది వద్ద రూ.400 కోట్లకు పైగా పుల్లారావు వసూలు చేశాడు. ఈ నగదుతో రాత్రికి రాత్రే కుటుంబంతో ఉడాయించాడు. బాధితులు ఒక్కొక్కరూ తమకు జరిగిన అన్యాయంపై గోడు వెళ్లబోసుకున్నారు. కమిటీగా ఏర్పడి పుల్లారావు ఆస్తులెంత.. అప్పులెంత ? అంటూ ఆరా తీశారు. ఇప్పటికే ఎమ్మెల్యే అరవింద్ బాబు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవి, హోంమంత్రి అనితలను సైతం కలిసి న్యాయం చేయాలని వేడుకున్నారు. సీఐడీకి కేసు అప్పగించవద్దంటూ విన్నవించుకున్నారు. ఎవరికి వారు తాము అండగా నిలబడతామని చెప్పారేగానీ.. బాధితులను న్యాయం చేసే దిశగా మాత్రం చర్యలు శూన్యం. బాధితులు భయపడినట్టే కేసు చివరకు సీఐడీకి చేరింది. అయినప్పటికీ న్యాయం జరిగే అవకాశాలు లేకపోవడంతో ఆదివారం నరసరావుపేటలోని ఓ హోటల్‌లో బాధితులంతా సమావేశమై పలు తీర్మానాలు చేశారు. పుల్లారావు స్కాంపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని ఎమ్మెల్యే అరవింద్ బాబును కలసి విన్నవించారు.

ఆ డబ్బులకు లెక్కలు చెప్పండి..

కూటమి ప్రభుత్వం ఎంత వేడుకున్నా పట్టించుకోకుండా పుల్లారావు కేసును నీరుగార్చేలా సీఐడీకి అప్పగించింది. సీఐడీ బాపట్ల ఎస్పీ తుషార్‌తో కలసి ఒక సిట్ బృందాన్ని ఏర్పాటు చేసింది. అయితే సీఐడీకి బదిలీ అయ్యాక 15 రోజులకుగానీ బాధితులతో సిట్ అధికారులు మాట్లాడలేదు. సీఐడీ బృందం ఒక్కసారి కూడా నరసరావుపేటలోని సాయిసాధన చిట్‌ఫండ్‌కు వచ్చి తనిఖీలు చేపట్టలేదు. బాధితులను మాత్రం ఫిరంగిపురం పోలీస్‌స్టేషన్, గుంటూరు సీఐడీ కార్యాలయానికి పిలిపించుకుని విచారణ చేస్తున్నారు. అక్కడ తమనే దోషుల్లాగా చూస్తూ సీఐడీ అధికారులు వ్యవహరిస్తున్నారంటూ బాధితులు వాపోతున్నారు. అసలు పుల్లారావుకు ఇచ్చేందుకు మీకు డబ్బులు ఎలా వచ్చాయో లెక్కలు చెప్పండంటూ ఎదురు ప్రశ్నలు వేస్తున్నారట. దీంతో బాధితులు ఇదెక్కడి దారుణమంటూ బోరున విలపిస్తున్నారు. సీఐడీ అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో బాధితులు వారి వద్దకు వెళ్లేందుకు కూడా వెనుకడుగు వేస్తున్నారు. ఉన్న కష్టాలకు తోడు కొత్త సమస్యలు వస్తాయేమోనన్న ఆలోచనతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. తమకు న్యాయం చేస్తారని ఆశించి వస్తే ఇదేం తీరని ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు.



సాయిసాధన చిట్‌ఫండ్ కార్యాలయం

దర్జా అంటే పుల్లారావు కుటుంబానిదే..

పుల్లారావుకు చెందిన సాయిసాధన చిట్‌ఫండ్‌తోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో కూడా ఆయన భార్య, కుమారుడు, కుమార్తె, అత్తమామలు భాగస్వాములుగా ఉన్నారు. ఈ చీటింగ్ వ్యవహారంలో వీరంతా దోషులే. అయితే పుల్లారావు కోర్టులో లొంగిపోయి రెండు నెలలు కావస్తున్నా ఆయన కుటుంబ సభ్యులపై కనీస చర్యలు కూడా లేవు. వీరంతా ప్రజల సొమ్ముతో దర్జాగా బయట తిరుగుతున్నారు. పుల్లారావుతోపాటు అతని కుటుంబసభ్యులపై నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదవ్వడంతో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకొన్నారు. వారిని అరెస్ట్ చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు బాధితులు బోరున విలపిస్తుంటే.. పుల్లారావు కుటుంబ సభ్యులు మాత్రం ఎంచక్కా దర్జాగా తిరుగుతున్నారు.

పెద్దల హస్తంపై అనుమానాలు



పుల్లారావు

పుల్లారావు విషయంలో మొదటి నుంచీ పోలీసు శాఖలోని పెద్దల హస్తం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతోపాటు ప్రభుత్వ పెద్దలూ అతనికి అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తొలి నుంచీ పరిశీలిస్తే పుల్లారావు మోసాల చిట్టా బయట పడిన నెల తర్వాతగానీ ఆయన కోర్టులో లొంగిపోలేదు. ఈలోగా ప్రజల నుంచి దోచిన సొమ్మంతా వివిధ రూపాల్లో దారి మళ్లించాడు. పుల్లారావును అరెస్టు చేసి, దోచుకున్న సొమ్ము రికవరీ చేయడంపై పోలీసులు దృష్టి సారించలేదు. దీని వెనుక పోలీసు ఉన్నతాధికారులతోపాటు ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని బాధితులు మండిపడుతున్నారు. సుమారు వెయ్యి మంది బాధితులు ఉంటే ప్రభుత్వం ఆర్థిక నేరగాడైన పుల్లారావుకు లబ్ధి చేకూరేలా వ్యవహరించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇదెలా పారదర్శక పాలన అంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

గుంటూరు రేంజ్‌కు 53 మంది ప్రొబేషనరీ ఎస్‌ఐలు

- జిల్లాల వారీగా కేటాయింపులు
- నియామక ఉత్తర్వులు అందించిన రేంజ్ ఐజీ




ప్రొబేషనరీ ఎస్‌ఐలతో మాట్లాడుతున్న గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

నగరంపాలెం: సమర్థంగా విధులు నిర్వర్తించాలని, ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదివారం ప్రొబేషనరీ ఎస్‌ఐలకు సూచించారు. శిక్షణ పూర్తయి, గుంటూరు రేంజ్ పరిధిలో విధుల నిర్వహించేందుకు ఎంపికైన 53 (36 మంది పురుషులు, 17 మంది మహిళలు) మంది ప్రొబేషనరీ ఎస్‌ఐలు గుంటూరు నగరంలోని గుంటూరు రేంజ్ కార్యాలయంలో ఐజీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ క్రమశిక్షణ, నిజాయతీ, పారదర్శకత, జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని వారికి సూచించారు. తద్వారా పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం వారికి జిల్లాలు కేటాయిస్తూ నియామక ఉత్తర్వులను ఐజీ అందించారు. గుంటూరు జిల్లాకు 22 మంది, పల్నాడు జిల్లాకు 13, బాపట్ల జిల్లాకు 10, ప్రకాశం జిల్లాకు ఒకరు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు ముగ్గురు, తిరుపతి జిల్లాకు నలుగురిని కేటాయిస్తూ నియామక ఉత్తర్వులు అందించారు. ఈనెల 2 నుంచి 6 వ తేదీ వరకు పీఎస్‌ఐలకు సెలవులని ఐజీ తెలిపారు. అనంతరం ఈ నెల 7వ తేదీ నుంచి గ్రేహౌండ్స్ శిక్షణకు పంపిస్తామని వెల్లడించారు. అనంతరం పీఎస్‌ఐలతో కూడా ఐజీ ప్రత్యేకంగా మాట్లాడారు.

పట్టాభిషేకం ఎవరికో!

నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు



ఏసీ కళాశాలలో ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు చేసిన టేబుళ్లు

- ఏసీ కళాశాల కౌంటింగ్ కేంద్రంలో పూర్తయిన ఏర్పాట్లు
- ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల ఓట్ల లెక్కింపు ఇక్కడే
- 2.41 లక్షల ఓట్లను లెక్కించేందుకు 28 టేబుళ్లు ఏర్పాటు
- వివరాలు వెల్లడించిన ఆర్‌ఓ, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, పక్కన జేసీ భార్గవ్ తేజ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి కృష్ణా – గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కళాశాల(ఏసీ)లోని కౌంటింగ్ కేంద్రంలో భద్రపరచిన బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం నిక్షిప్తమైంది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదివారం ఏసీ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం జేసీ ఎ.భార్గవ్ తేజతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాగలక్ష్మి మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘ ఆదేశాల మేరకు ఓట్ల లెక్కింపు చేపడుతున్నామని, ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసిన అనంతరం అన్ని జిల్లాల బ్యాలెట్ బాక్సులు ఏసీ కళాశాలలోని స్ట్రాంగ్ రూములో భద్రపర్చినట్లు చెప్పారు. పోలింగ్ 69.57 శాతంగా నమోదైన దృష్ట్యా దాదాపు 2.41 లక్షల ఓట్లు లెక్కించాల్సి ఉందన్నారు.

28 టేబుళ్లు ఏర్పాటు

ఇందుకు 28 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. బ్యాలెట్ పేపర్, మొదటి ప్రాధాన్యత ఓట్లు విధానంతో లెక్కింపు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రక్రియ ప్రకారం కౌంటింగ్ సుమారు రెండు నుంచి మూడు రోజులు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రాథమికంగా కౌంటింగ్ మొదటి రౌండ్‌లో పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్లను సరిచూసుకొని మిక్సింగ్ చేస్తారన్నారు. తదుపరి చెల్లుబాటయ్యే ఓట్లను పరిశీలించి, మొదటి ప్రాధాన్యత ఓట్లను లెక్కించడం జరుగుతుందన్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు పూర్తి అయ్యే సమయానికి నిర్దేశించిన కోటా ఓట్లు వచ్చిన అభ్యర్థి గెలుపొందినట్లు ప్రకటించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఎవరికీ నిర్దేశిత ఓట్లు రాకపోతే ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ వారికి వచ్చిన తదుపరి ప్రాధాన్యత ఓట్లను ఇతర అభ్యర్థులకు పంచుతూ కౌంటింగ్ నిర్వహిస్తామన్నారు.

మూడు షిఫ్టుల్లో 750 మందికి విధులు..

ఓట్లు లెక్కింపు కోసం మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా 750 మంది సిబ్బందికి వివిధ విధులను కేటాయించినట్లు తెలిపారు. అభ్యర్థులు సైతం ఏజెంట్లను మూడు షిఫ్టుల్లో నియమించుకునేలా అవకాశం కల్పించామన్నారు. కౌంటింగ్ ప్రదేశం మొత్తం మూడంచెల పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, గుర్తింపు కార్డు లేకుండా ఏ ఒక్కరిని కౌంటింగ్ ప్రాంతానికి అనుమతించబోమన్నారు. అదే విధంగా కౌంటింగ్ హాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించరని, పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన తర్వాతే కౌంటింగ్ హాల్లోకి ఏజెంట్లను, కౌంటింగ్ సిబ్బందిని అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు తెలియజేసేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. వీటితో పాటు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..

- కోటప్పకొండలో పేరుకుపోయిన చెత్త
- తిరునాళ్లతో రోడ్ల వెంట భారీగా పోగు పడిన వ్యర్థాలు
- నాలుగు రోజులైనా పారిశుద్ధ్య పనులు శూన్యం
- గుట్టలుగా పేరుకుపోయిన చెత్తతో దుర్వాసన
- అధికారుల తీరుపై మండిపడుతున్న భక్తులు



ప్రధాన రోడ్డు వెంట పేరుకుపోయిన చెత్త



కుప్పలుగా గోతాలలో వ్యర్థాలు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ పుణ్య క్షేత్రం చెత్తతో నిండిపోయింది. తిరునాళ్లతో పోగైన వ్యర్థాలను తొలగించడంలో పంచాయతీ రాజ్ శాఖ నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ చూసినా గుట్టలుగా వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారుల వెంట కుళ్లిన వాటితో దుర్వాసన వస్తోంది. దీంతో స్థానికులతోపాటు భక్తులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ తిరునాళ్ల గత నెల 26వ తేదీన నిర్వహించారు. లక్షలాది మంది పాల్గొన్నారు. ఇది గడిచి నాలుగు రోజులైనా పారిశుద్ధ్య కార్యక్రమాలు మాత్రం చేపట్టలేదు. కొండ దిగువున ప్రధాన రహదారులు వెంట చెత్త పేరుకుపోయింది. తాత్కాలిక దుకాణాలు, చెరకు రసం దుకాణాల వ్యర్థాలు పోగయ్యాయి. ప్రభల నిధి, అధికారుల తాత్కాలిక వసతి గృహాల ప్రాంతం వద్ద ప్లాస్టిక్ కవర్లు, పేపర్ టీకప్పులు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. ప్రధాన సెంటర్‌లోని దుకాణాదారులు వ్యర్థాలను గోతాలలో రోడ్ల వెంట పడేశారు. అధికారులు వాటిని తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. కొన్ని స్వచ్ఛంద సంస్థలు అన్నవితరణ చేసి ఆకులను వదిలివెళ్లడంతో అవీ పోగయ్యాయి. ముక్కు మూసుకొని భక్తులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. పంచాయతీ రాజ్ శాఖ 350 మంది వరకు కూలీలను తిరునాళ్లకు విధుల్లో నియమించింది. సగం మంది కాంట్రాక్ట్ కార్మికులు. మూడు రోజులపాటు వీరు కొండ దిగువున పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తిరునాళ్ల అనంతరం అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఏటా తిరునాళ్ల ముగిసిన మరుసటి రోజు నుంచే పారిశుద్ధ్య పనులు జరిగేవి. వారం రోజులపాటు చెత్తను తొలగించేవారు. ఈ ఏడాది కనీసం ఇటువైపు చూసిన వారే కరవయ్యారు.

కూలీల కొరతే కారణం

తిరునాళ్ల ఏర్పాట్ల కోసం మండలంలోని కాంట్రాక్ట్ కూలీలతోపాటు రోజువారీగా కొంతమందిని నియమించాం. తిరునాళ్ల తరువాత కూలీలు అందుబాటులో లేకపోవడంతో పారిశుద్ధ్య పనులు ప్రారంభించలేదు. కాంట్రాక్ట్ కూలీలకు ఆరోగ్య సమస్యలు కూడా మరో కారణం. సోమవారం నుంచి వ్యర్థాలు తొలగించే పనులు ప్రారంభిస్తాం.

– నాగానంద్, ఈఓపీఆర్‌డీ, నరసరావుపేట మండలం

నేటి నుంచి సీనియర్ ఇంటర్ పరీక్షలు

గుంటూరు జిల్లాలోని 87 కేంద్రాల్లో హాజరు కానున్న 35,946 మంది

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ద్వితీయ సంవత్సర విద్యార్థులకు సోమవారం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. గుంటూరు జిల్లా వ్యాప్తంగా హాజరుకానున్న 35,946 మంది విద్యార్థులకు 87 కేంద్రాలను సిద్ధం చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 8.30 నుంచి కేంద్రాల్లోకి అనుమతించడం ప్రారంభించిన తరువాత, 9 గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు యంత్రాంగం 144 సెక్షన్ అమలు పరుస్తోంది. గుంటూరులోని ఏసీ కళాశాలలో సోమవారం నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతున్న దృష్ట్యా, ఏసీ కళాశాల కేంద్రంగా ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాల్ టిక్కెట్లు పొందిన విద్యార్థులకు పక్కనే ఉన్న ఏసీ లా కళాశాల ద్వారం నుంచి పరీక్ష కేంద్రంలోకి పంపేందుకు ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ఉపవాస దీక్షలు

పవిత్ర రంజాన్ మాసం ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. ముస్లింలు వేకువజామున సహరిని సేవించి రోజా (ఉపవాస దీక్ష) ఆరంభించారు. దైవచింతనలో నిమగ్నమైన వారు పగలు ప్రార్థనలు నిర్వహించారు. ఖురాన్ పఠనానికి ప్రాధాన్యత ఇచ్చారు. సాయంత్రం మసీదుల్లో భక్తి శ్రద్ధలతో ఇఫ్తార్ నిర్వహించారు. సామూహికంగా దీక్షలను విరమిస్తూ, మానవతా విలువలను గుర్తు చేసుకున్నారు. రంజాన్ మాసం మొదటిరోజే విశ్వాసులతో మసీదులు కళకళలాడాయి. సమాజంలో సోదరభావాన్ని పెంపొందించేందుకు ఈ పవిత్ర మాసం గొప్ప సందేశాన్ని అందిస్తుందని మత పెద్దలు పేర్కొన్నారు.

– యడ్లపాడు



బిలాల్ మసీదులో ఇఫ్తార్‌లో ముస్లింలు

క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సత్తెనపల్లి: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పల్నాడు జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇంటర్ కాలేజ్ పవర్ లిఫ్టింగ్ టోర్నమెంట్ అండ్ ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఎంపికలు గత నెల 27వ తేదీన నిర్వహించారు. ఈ పోటీల్లో పురుషుల జట్టులో ఎం.వినయ్ (66 కేజీల విభాగం), ఎస్.శరత్ (74 కేజీల విభాగం), మహిళల జట్టులో టి.జ్యోతి 76 కేజీల విభాగంలో బంగారు పతకాలు సాధించారు. టీమ్ ఓవరాల్ టైటిల్స్ స్ట్రాంగ్ మెన్‌గా ఎస్.శరత్, స్ట్రాంగ్ ఉమెన్‌గా టి. జ్యోతి నిలిచారు. ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎస్.శరత్, టి.జ్యోతిలు ఎంపికయ్యారు. వారిని ఆదివారం పట్టణంలో ప్రత్యేకంగా అభినందించారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ పల్నాడు జిల్లా సెక్రెటరీ పసుపులేటి సురేష్ మాట్లాడుతూ.. క్రీడాకారులు మరింత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ పల్నాడు జిల్లా ప్రెసిడెంట్ జిమ్ రాజు, క్రీడాకారులు కత్తి ప్రవీణ్, రాహుల్ గౌతమ్, సయ్యద్ మస్తాన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ బడుల పనివేళలు మార్చాలని డిమాండ్

నరసరావుపేట ఈస్ట్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఉర్దూ పాఠశాలల పనివేళలు మార్చాలని ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సంపత్‌బాబు, కె.కిషోర్‌లు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత మూడు దశాబ్దాలుగా రంజాన్ మాసంలో ఇలా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ అవుతున్నట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం రంజాన్ మాసం ప్రారంభమైనప్పటికీ ఉత్తర్వులు రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ పాఠశాలల్లో దాదాపు రెండు లక్షల మందికిపైగా విద్యార్థులు, 10 వేల మందికిపైగా ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారని వివరించారు. రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉంటారని, దీనిని దృష్టిలో పెట్టుకొని వెంటనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్నారు.

మెప్పించని రాష్ట్ర బడ్జెట్

- సూపర్ సిక్స్ పథకాల అమలుకు తగిన నిధుల కేటాయింపులో గారడీలు
- 70 శాతం మంది ఆధారపడిన సాగు రంగానికి 7 శాతమే నిధులా?
- చర్చా గోష్టిలో కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం



మాట్లాడుతున్న పీడీఎం రాష్ట్ర కమిటీ నేత వెంకటేశ్వరరావు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ మెజారిటీ ప్రజలను మెప్పించలేకపోయిందని ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. కేటాయింపులకు, ఖర్చులకు పొంతన లేని బడ్జెట్ అని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక కోటప్పకొండరోడ్డులోని సీపీఎం కార్యాలయంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి అధ్యక్షతన రాష్ట్ర బడ్జెట్‌పై చర్చా గోష్టి నిర్వహించారు. పీడీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. 70 శాతానికిపైగా ఉన్న వ్యవసాయ రంగానికి ఏడు శాతం నిధులు కేటాయించడం సరికాదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో వరికెపూడిశెల ప్రాజెక్టుకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం కూటమి నేతల ప్రాధాన్యతలు వేరని చెబుతోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ వర్గాలకు ఇచ్చే రాయితీలు ఎన్నటికీ పేదలకు ఇవ్వబోమని చెప్పినట్లుగా బడ్జెట్ ఉందని తెలిపారు. బడ్జెట్ అంకెలు గారడీ మినహా మరేం కాదని అన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టుకు వెంటనే నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు కోసం సరైన కేటాయింపులు చేయలేదని విమర్శించారు. తల్లికి వందనం పేరిట ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, అన్నదాతా సుఖీభవ కింద ఏటా రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని చెప్పినా అందుకు తగిన నిధులు కేటాయించలేదని అన్నారు. కేంద్రం ఇచ్చే మొత్తంతో కలిపి రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం మాట మార్చడం ప్రజల్ని వంచించడమేనని పేర్కొన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పచ్చవ రామారావు, సీఐటీయూ నాయకులు షేక్ సిలార్ మసూద్, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్న, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోటనాయక్ ప్రసంగించారు. కార్మికులు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, దళితులు, గిరిజనులను ఈ బడ్జెట్ నిరాశకు గురిచేసిందని విమర్శించారు. లోపాలను సరిచేసి పేదలకు బడ్జెట్‌లో తగిన కేటాయింపులు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానిది దగా బడ్జెట్

రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చందోలు రాజ్‌కుమార్



రాజ్‌కుమార్

జె.పంగులూరు: ఎన్నో మోసపూరిత హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం, తప్పించుకునే వీల్లేక, రాష్ట్ర ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు చివరికి ఒక దగా బడ్జెట్ ప్రకటించిందని రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చందోలు రాజ్‌కుమార్ దుయ్యబట్టారు. మండల పరిధిలోని పంగులూరులో ఆదివారం ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామన్న పథకం ఏమైందని ప్రశ్నించారు. తల్లికి వందనం అభాసు పాలైందని, అనేక కారణాలతో విద్యార్థుల సంఖ్య కూడా తగ్గించే విధంగా చేస్తున్నారని తెలిపారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ కింద రూ.10 లక్షలు, ప్రతి మహిళకు రూ.1500 సంగతి ఎటు పోయిందని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఎక్కడకి పోయిందని ప్రశ్నించారు. ఇప్పటికే రూ. లక్ష కోట్లు అప్పు చేసిన ప్రభుత్వం మరో రూ.80 వేల కోట్లు తీసుకురావాలని ప్రకటించడం సంపద సృష్టిలో భాగమా అని ఎద్దేవా చేశారు.

చిన్నారిపై బాలుడు లైంగిక దాడికి యత్నం

చెరుకుపల్లి: ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడి జరిగిన ఘటన మండలంలోని ఆరేపల్లి పంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది. ఆదివారం అదే గ్రామానికి చెందిన 16 సంవత్సరాల వయసు గల ఓ మైనర్ బాలుడు చిన్నారికి చాక్లెట్ ఆశ చూపి లైంగిక దాడికి ప్రయత్నించాడు. ఆ చిన్నారి ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లి తల్లికి చెప్పింది. ఆమె వెంటనే తెనాలి ఏరియా హాస్పిటల్‌కు వైద్య పరీక్షల నిమిత్తం తీసుకువెళ్లినట్లు సమాచారం. దీనిపై స్థానిక ఎస్ఐను సంప్రదించగా చిన్నారి నాన్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



గాయాలపాలైన రామకృష్ణ, అరుణ, అనంతలక్ష్మి, సామ్రాజ్యం



ప్రమాదానికి గురైన కారు

దెందులూరు: వివాహానికి కారులో వెళ్లి తిరిగొస్తుండగా జరిగిన ప్రమాదంలో ఐదుగురు గాయాలపాలయ్యారు. ఏలూరు జిల్లా దెందులూరు మండలం సత్యనారాయణపురం గుండేరు వాగు వద్ద శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నివాసం ఉంటున్న ఊట్ల రామకృష్ణ కుటుంబసభ్యులు ఐదుగురు కలసి కారులో పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో వివాహానికి వెళ్లారు. అనంతరం శనివారం రాత్రి రాజమహేంద్రవరానికి బయలుదేరారు. అర్ధరాత్రి దాటాక రెండు గంటల సమయంలో ఏలూరు జిల్లా దెందులూరు మండలం సత్యనారాయణపురం గుండేరు వాగు వద్దకు వచ్చారు. ఎదురుగా వెళుతున్న లారీని దాటేందుకు ప్రయత్నించగా, కారు అదుపు తప్పి లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న ఊట్ల రామకృష్ణకు తలపై, ఆయన భార్య అరుణ కాలికి గాయాలయ్యాయి. రామకృష్ణ నాయనమ్మ అనంతలక్ష్మి, అరుణ అమ్మమ్మ సామ్రాజ్యం, వారి కుటుంబసభ్యుడు ఇరుసుమల్లి మణికంఠ కూడా గాయాలపాలయ్యారు. దెందులూరు ఏఎస్ఐ వెంకటేశ్వరరావు, హైవే పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్సులో ఆశ్రం ఆస్పత్రికి తరలించారు. బాధితులకు చికిత్స అందిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శివాజీ తెలిపారు. డ్రైవరు నిద్రమత్తు వల్ల ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోంది.

9న తెలుగు సినిమా పాటల పోటీలు

సత్తెనపల్లి: చైతన్య కళా స్రవంతి 46వ వార్షికోత్సవ సందర్భంగా షేక్ షకీలా బేగం కళావేదికలో ఈ నెల 9న ఉదయం 10 గంటలకు జాతీయస్థాయి తెలుగు సినిమా పాటల పోటీలు ఉంటాయని సంస్థ అధ్యక్షుడు లయన్ కమతం శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. తొలి ముగ్గురు విజేతలకు రూ. 5 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు వంతున నగదు బహుమతులు అందిస్తామన్నారు. 10 మందికి రూ. 500 చొప్పున ప్రత్యేక నగదు బహుమతులు ఉంటాయన్నారు. వివరాలకు 93901 32978 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యువతితో అసభ్య ప్రవర్తన

సత్తెనపల్లి: యువతితో ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలంలోని ఓ గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాలు.. మిరపకాయల కోతలకు ప్రకాశం జిల్లా దర్శి ప్రాంతానికి చెందిన 40 మంది కూలీలు నెల క్రితం వచ్చి గుడారాలు వేసుకొని జీవనం వెళ్లదీస్తున్నారు. కూలీలలో ఓ మహిళ అనారోగ్యం పాలవడంతో కుమార్తె ఇడ్లీ తెచ్చేందుకు సిద్ధమైంది. కూలీలను గ్రామానికి తీసుకువచ్చిన హనిమిరెడ్డి అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై ఆ యువతిని ఎక్కించుకొని వెళ్లాడు. ఇడ్లీ తీసుకొని తిరిగి వస్తుండగా వాహనం నడుపుతూనే వెనుక కూర్చున్న యువతిపై చేతులు వేసి అసభ్యంగా ప్రవర్తించాడు. గుడారాల వద్ద కాకుండా మరికొంత ముందుకు తీసుకెళ్లి ద్విచక్ర వాహనాన్ని ఆపి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించేందుకు యత్నించడంతో ఆమె పెద్దగా కేకలు వేస్తూ పరుగులు పెట్టింది. గుడారాల వద్దకు చేరుకొని జరిగిన ఘటనను తల్లిదండ్రులకు వివరించి విలపించింది. గ్రామ పెద్దలు వచ్చి రాజీ ప్రయత్నాలు చేస్తున్నారు. సమాచారం అందుకుని సంఘటనా స్థలాన్ని సత్తెనపల్లి రూరల్ పోలీసులు సందర్శించి, వివరాలు సేకరించారు.

పెనుమాకకు 'సాహితీ రత్న' ప్రదానం



అద్దంకి రూరల్: ప్రముఖ కవి పెనుమాక నాగేశ్వరరావుకు సాహితీ మిత్రమండలి సాహితీ రత్న బిరుదును ప్రదానం చేసింది. ఆదివారం స్థానిక చిన్ని శాంతయ్య పిచ్చమ్మ సేవాసదన్‌లో సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ప్రముఖ కవి పెనుమాక నాగేశ్వరరావు రచనలపై పాలపర్తి జ్యోతిష్మతి, కుందుర్తి స్వరాజ్యపద్మజ విశ్లేషించారు. పెనుమాక నాగేశ్వరరావు మాట్లాడుతూ తానురచించిన నాన్న నువ్వు సున్నానా, ఫొరెన్సెంటు, బార్‌తం, నైతరుణి, ఆలయం, దేవుడిపాట నవల గురించి వర్ణించారు. కార్యక్రమంలో యు. దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, ఎ.ఎల్వీ ప్రసాద్, ఆర్వీ రాఘవరావు, చందలూరి నారాయణ, పీసీ మెచ్ కోటయ్య, ఎల్.శివరావు, చప్పిడి వీరయ్య, ఎల్.శ్రీనివాసరావు, చుండూరి మురళీ సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గ్రామీణ కళారూపాలు



కాకతీయ కళా వేదికపై ప్రదర్శించిన పౌరాణిక పద్య నాటకంలోని దృశ్యం

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్లలో ఐదు చోట్ల ప్రదర్శించిన సంప్రదాయ గ్రామీణ కళారూపాలు భక్తులను, యాత్రికులను ఆకట్టుకున్నాయని మంచి చిత్రాల అభిమాన సంఘం ప్రతినిధులు ఈదర గోపీచంద్, కంచర్ల నాగవీరయ్యలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాలివాహన సత్రంలో కావూరు గ్రామానికి చెందిన కళాకారులు గొట్టం ఆంజనేయులు దర్శకత్వంలో ప్రదర్శించిన బ్రహ్మం గారి నాటకం అలరించిందని తెలిపారు. కాకతీయ కళావేదికపై సినిమా పాటల కచేరీతోపాటు గయోపాఖ్యానం, శ్రీకృష్ణ రాయబారం, రామాంజనేయ యుద్ధం పౌరాణిక పద్య నాటకాలు ప్రదర్శించారని పేర్కొన్నారు. అలాగే దివ్యాంగ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాటల కచేరీ, మిమిక్రీ, ఏకపాత్రాభినయాలు ఆకట్టుకున్నాయని తెలిపారు. కావూరు ప్రభ వద్ద మహిళా కోలాటం, భట్రాజు సత్రంలో బ్రహ్మంగారి నాటకాన్ని ప్రదర్శించారని చెప్పారు. త్వరలో పట్టణంలో నిర్వహించే అభినందన సభలో వారిని సత్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో సాంస్కృతిక వేదికపై ప్రదర్శనలు ఇవ్వలేకపోయామని పద్య కవి, నటులు ఈపూరి వెంకటరెడ్డి వాపోయినట్లు వివరించారు.

లింగంగుంట్ల భూ సమస్య పరిష్కారానికి మళ్లీ యత్నం



పుష్పగిరి స్వాముల వారి మఠంలో ఎంపీ లావు, ఎమ్మెల్యే చదలవాడ, గ్రామ నాయకులు

నరసరావుపేట: మండలంలోని లింగంగుంట్ల పుష్పగిరి పీఠం అగ్రహారం భూముల సమస్య పరిష్కారం కోసం మరోసారి ప్రయత్నం జరిగింది. ఆదివారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి లింగంగుంట్ల గ్రామ నాయకులు హైదరాబాదులోని పుష్పగిరి స్వాముల వారిని కలిసి చర్చించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్వాముల వారికి, రైతుల మధ్య ఓ అంగీకారం కుదిరిన విషయం విదితమే. దీనిపై ఇరువర్గాల మధ్య ఒక అగ్రిమెంట్ కూడా కుదిరింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత తొలిసారిగా మళ్లీ భూముల విషయమై స్వాముల వారిని కలిసి చర్చించారు. మఠానికి ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన స్వాముల వారు కోర్టు తీర్పు మేరకు రైతుల ఆధీనంలో ఉన్న తమ భూములు తమకు కావాల్సిందేనని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అయితే చర్చలు నంతరం త్వరలో భూముల రిజిస్ట్రేషన్ జరగనున్నట్లుగా టీడీపీ నాయకులు ప్రకటించటం గమనార్హం. ఏమవుతుందో రాబోయే రోజుల్లో తేలనుంది. స్వాముల వారిని కలిసిన వారిలో మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి, యన్నం రవీంద్ర రెడ్డి, గుంగుల పెద్దిరెడ్డి, పొన్నపాటి వెంకటేశ్వర రెడ్డి, డాక్యుమెంట్ రైటర్ ఏరువ బాలమోహనరెడ్డి ఉన్నారు.

చిరు వ్యాపారులకు అండగా నిలవాలి

ఐసీసీ అధ్యక్షుడి సన్మాన సభలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని



యేల్చూరి వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు, వ్యాపారులు

నగరంపాలెం: చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు సమష్టి నిర్ణయంతో చిన్న వ్యాపారులకు బ్యాంకు రుణాలు ఇప్పించే దిశగా పయనించాలని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ది ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన యేల్చూరి వెంకటేశ్వర్లుకు ఆత్మీయ సన్మాన మహోత్సవం, రజత కిరీటంతో ఆదివారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సత్కరించారు. తొలుత అతిథులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ కొత్తగా వ్యాపారాలు చేసే వారికి అవగాహన కల్పించాలని అన్నారు. బ్యాంక్ అధికారులతో మాట్లాడి రుణాలు ఇప్పించే దిశగా ముందుకెళ్లాలని సూచించారు. ఆన్‌లైన్‌లో డిజిటల్ మార్కెటింగ్ పై శిక్షణ అందించాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను వ్యాపారులకు వివరించాలని అన్నారు. క్రేన్ గ్రూప్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు మాట్లాడుతూ చాంబర్ ఆఫ్ కామర్స్ గతంలో కొంతమేర నిర్వీర్యమైపోయిందని అన్నారు. ఇప్పటికైనా ఎన్నికలు నిర్వహించి అధ్యక్షుడిని ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. ఇకనైనా సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా ఐసీసీకి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సన్మాన గ్రహీత ఐసీసీ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యాపారులకు అండగా ఉంటానని చెప్పారు. ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, కన్నా లక్ష్మీనారాయణ, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్‌లు మాట్లాడారు. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ, ఐసీసీ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, డిప్యూటీ మేయర్ సజల, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, పోతురాజు సమత, నాయకులు కొనకళ్ల సత్యం, కొత్తూరు వెంకట్ పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకులుగా వెచ్చా కృష్ణమూర్తి, దేవరశెట్టి సుబ్బారావులు వ్యవహరించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



వేడుకను తిలకిస్తున్న భక్తులు



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



దర్శనానికి బారులు తీరిన భక్తులు

గురజాల: నగర పంచాయతీలోని జంగమహేశ్వరపురంలో పలనాటి తిరుమలగా పేరుగాంచిన శ్రీ అలమేలు మంగా పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. తొలుత దేవాలయ ప్రాంగణంలోని కల్యాణ మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. మండపంలో అలమేలు మంగా పద్మావతీ సమేత వెంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని వేదపండితులు కారెంపూడి వరదాచార్యులు, రాఘవాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు దంపతులు ఈ మహోత్సవంలో పీట్లపై కూర్చున్నారు. వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నసంతర్పణ, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. మరోవైపు స్వామి వారి 49వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఉత్సవాల సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవాలయంలో హోమం, బలిహరణంతో పాటుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సకల ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఎదురు కోల, కోలాట కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రైలులో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

దాచేపల్లి: రేపల్లె ఎక్స్‌ప్రెస్ రైలులో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.వివరాలు.. ఆదివారం రేపల్లె నుంచి సికింద్రాబాద్‌కు రైలు బయలుదేరింది. మొదటి లగేజీ బోగీలో ఇనుపరాడ్‌కి ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రయాణికులు గుర్తించారు. గార్డుకు సమాచారం ఇవ్వటంతో రైలును నడికుడి స్టేషన్‌లో నిలిపివేశారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు వెళ్లి పరిశీలన చేయగా దుప్పటితో ఉరేసుకుని వ్యక్తి చనిపోయినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడిని బాపట్ల జిల్లా చీరాల మండలం చిన్నగంజాంకి చెందిన బాలిగ రాంబాబు(43)గా గుర్తించారు. లారీ క్లీనర్‌గా పని చేసేవాడని తెలిసింది. ఈ నేపథ్యంలో 15 నిమిషాలపాటు రైలును నడికుడి రైల్వేస్టేషన్‌లో ఆపారు.

రజకులకు బడ్జెట్‌లో అన్యాయం

సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాటికలపూడి జయరాం



పాటికలపూడి జయరాం

బాపట్ల: లాండ్రీలు, దోబీఘాట్ల విద్యుత్ అవసరాలకు కూటమి ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడంపై రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాటికలపూడి జయరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం బాపట్ల వచ్చిన జయరాం స్థానిక మీడియాతో మాట్లాడుతూ టీడీపీ రజకులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తుందన్నారు. రజకుల నిర్మాణాత్మకమైన అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వటం లేదన్నారు. లాండ్రీలకు ఇచ్చే 150 యూనిట్లకు, దోబీ ఘాట్లకు ఇచ్చే ఉచిత విద్యుత్ అవసరాలకు బడ్జెట్లో నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడంపై రాష్ట్రంలో రజకులు ఆగ్రహంతో రగిలిపోతున్నారన్నారు. రజకులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని తెలుగుదేశం ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ఆర్థిక భారం పడని హామీలు నెరవేర్చే అవకాశం ఉన్నా, కూటమి ప్రభుత్వం రజకులకు మేలు చేసేందుకు సిద్ధంగా లేదన్నారు. కూటమి ప్రభుత్వానిది పెత్తందారుల ప్రభుత్వం కాబట్టే రజకుల ఈనాం భూముల అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. రజకులకు ప్రత్యామ్నాయ భూములను కేటాయించడం లేదన్నారు. జగనన్న కాలనీలు, జగనన్న టౌన్స్ పేరుతో సేకరించిన కమ్యూనిటీ స్థలాల్లో రజకుల వృత్తి అవసరాలకు ప్రత్యేక స్థలాలను కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై కొత్తగా పడే ఆర్థిక భారం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేయూత కింద రజక వృత్తిదారులకు రూ.10 వేలు ఇచ్చారని, టీడీపీ పాలనలో రజకులు నిండా మోసపోయారని మండిపడ్డారు.